

# కర్రోడు త్రిశూలం పట్టిన కథ

మూలం : కుం. వీరభద్రుడు

అనువాదం : రంగనాథ రామచంద్రరావు





రేపు అమావాస్య అనగా కర్రోడు రెండే రెండు ముద్దలు తిన్నాడు. అమావాస్యపోయింది. పాడ్యమి వచ్చింది. ఒక్క ముద్దకూడా అన్నం లేని పొట్ట వీపుకు అంటుకుపోయేట్టు వుంది. చెంబుల కొద్ది నీళ్ళుతాగాడు. దొరగారింట్లో ఏ ఏ వంటలు చేస్తున్నారో, ఏవి చేయటంలేదో మనసులో వూహించుకున్నాడు. ఎండిన నాలుక అంచుల్లో వో విధమైన కమ్మని రసం పూరసాగింది. గబుక్కున మింగేశాడు. కడుపు నిండినట్లనిపించిది. త్రేన్పడానికి ప్రయత్నించాడు. రాలేదు. ఆయాసంగా అనిపించింది. నడవలేక గోడకు వొరిగి నుంచున్నాడు. కళ్ళు తిరిగినట్లయి చెట్లు, చేమలు, గుడిసెలు అన్ని కళ్ళముందు గిరగిరా తిరగసాగాయి. కొద్దిసేపట్లోనే తేరుకున్నాడు. గుడిసె లోపల ముసలి సుంకలి నొప్పులతో విసిగిపోయి వోమూల ముడుచుకుని పడుకుని వుంది. ఎప్పుడో చేసిన వంట తాలూకు పాత్రలను కడగనే లేదు. వాటి నుంచి వస్తున్న పాటి వాసన ముక్కుపుటాలను అదరగొడుతూ వుంది. పొద్దు మునిగేలోపు ఒక్క పిడికెడైనా అన్నం ఆమె నోటికి అందివ్వక పోతే ఆమె పరిస్థితి చేజారిపోవచ్చుని కర్రోడికి అనిపించింది. మళ్ళీ కళ్ళు తిరిగినట్లయింది. కళ్ళ ముందు చెట్లు, చేమలు, గుడిసెలు గిర్రున తిరిగాయి.

ఇప్పుడేం చేయాలి?.

చిత్రరేఖ.డి

ఎవర్నడగాలి ? కడుపు కాలుతోంది అనటమే తప్పు. ఎవడి పొట్టకు ఎవరూ బాధ్యులుకారు' - ఇలాంటి ఆలోచనలు తలలో పురుగులా తొలుస్తూవుంటే; ఎవడి వల్లనో కడుపు తెచ్చుకుని ఇంటి నుంచి పారిపోయి పేట చేరుకున్న కూతురు ద్యామిని కర్రోడు గుర్తు తెచ్చుకున్నాడు. జిడ్డు పదార్థాలు బాగా తినొచ్చనే ఆశతో అదే పేటలోని ఓటే కొట్లో ఎంగిలి ప్లేట్లు, కప్పులు కడుగుతున్న కొడుకు సిద్ధను జ్ఞాపకం చేసుకున్నాడు. కళ్ళల్లో నీళ్లు ఊరాయి. కన్నీళ్ళు కిందికి జారకుండా కనురెప్పలకు అటూ యిటూ స్వాతి ముత్యాల్లా నిలిచాయి. కోరికలకు పుట్టినోళ్ళు, ఒంటి కావరానికి పుట్టినోళ్ళు' అనుకున్నాడు. వాళ్ళు దొడ్డి పులుముకోవటం, వుచ్చపోసుకోవటం, వాళ్ళను భుజాల మీద ఎక్కించుకుని కొట్టూరు జాతరలో తిప్పుకురావడం, తాను తగ్గించుకుని వాళ్ళకు కడుపు నిండా తినిపించటం - యిలాంటి జ్ఞాపకాలతో ఒక్క పెట్టున దుఃఖం పొంగుకు వచ్చింది. 'గీ పల్లెలో ఉపాసాలతో, వనవాసాలతో సచ్చేకంటే పేటలో ఆళ్ళు సుకంగా వుండన్లే .......... " అని ముసలిది మునుపోసారి అంది.

కర్రోడు అప్పటికె ఆ వీధి ధాటాడు. అడ్డంగా వున్నవి - రెడ్డోళ్ళ సందు; కోమట్ల సందు; బ్రాహ్మల సందు; లింగాయతుల సందు. ఈ సందులన్నీ దాటితే లక్ష్మమ్మవ్వ తోపు కనిపిస్తుంది. తోపు మధ్యన కన్నీరవ్వబావి వుంది. దేవుళ్ళు, దేవతలు కట్టినట్టుగా పిలువబడుతున్న దిగుడుబావి. అందులో ఒకటో రెండో కాదు ఏడు బావులున్నాయి. తోపులోని చెట్లు కొమ్మలు 'రా' అంటూ పిలుస్తాయి. కన్నీరవ్వ బావి 'రా' అంటోంది. 'వెళ్ళాల్లో వెళ్ళకూడదో' అని కర్రోడు వో క్షణం ఆగి ఆలోచించాడు.

తెలుగోళ్ళ సంగడు, బోయ సణ్ణి, తిప్పి ఈ బావిలోనే పడ్డారు. ఉబ్బిన పొట్ట, కాళ్ళు, చేతులు, కనుగుడ్లు లేని కళ్ళు, జుట్టు లేని బోడితల, తెరుచుకున్న నోరు అబ్బా! చూట్టానికే చేతకాదు. అయితే గొయ్యి తీసే పని తనదే కావటంతో ఆ శవాల్ని చూడక తప్పలేదు. తను ఏన్నో శవాల్ని పూడ్చి పెట్టినా అంత దుఃఖం ఎందుకుపొంగుకురాలేదు. అయినా సంగడు, సణ్ణి, తిప్పి ఏం తప్పు చేశారని చనిపోయారు ? అప్పుడప్పుడే నూనూగు మీసాలు మొలుస్తున్న సంగడు జీవించి

***ఎంగిలి ప్లేట్లు, కప్పులు కడుగుతున్న కొడుకు సిద్ధను జ్ఞాపకం చేసుకున్నాడు. కళ్ళల్లో నీళ్లు ఊరాయి. కన్నీళ్ళు కిందికి జారకుండా కనురెప్పలకు అటూ యిటూ స్వాతి ముత్యాల్లా నిలిచాయి.***

వుండటం దొర గారికి యిష్టంలేకపోయింది. సంగడెక్కడ తన తల మీదెక్కి కూర్చుంటాడో అనే భయం. ఉబ్బిన ఆ శవాల వొంటిపై ఎన్ని మూగ దెబ్బల కమలిన గుర్తులో, గోతిలో పూడ్చేటప్పుడు కర్రోడికి అర్థమైంది. ఈ పల్లెటూళ్లో శూద్రులు నోరు విప్పితే, కడుపు చూపిస్తే ఏమవుతుందో కూడా. బోయ సణ్ణ పెద్ద మనిషై ఏడాది కూడా నిండలేదు. ఎర్రటి రంగుతో, బాగా బలసిన ఒళ్ళుతో వున్న దొరకి పుట్టిన 'కోడె' పేటనుంచి పారిపోయి రావటం; కల్లంలో గడ్డివాము చాటున మాటువేసి సణ్ణని పాడుచేయటానికి ప్రయత్నించటం అంతా కర్రోడికి తెలుసు. అయితే ఆ మరుసటి రోజే సణ్ణి ఈ విధంగా బావిలో తేలుతుందని కర్రోడు కలలోనూ వూహించలేదు. బ్రాహ్మణ రాఘుప్పని దొంగ చాటు కలసి గర్భవతైన తిప్పి బావిలోకి దూకి పరువు కాపాడుకోవటం చూసి కర్రోడికి ఒకటె ఆశ్చర్యం. తాను తోపు వేపు వెళ్ళాలా వద్దా అని ఆకలితోటే ఆలోచించాడు.

తీర్చుకోలేని ఆకలి వలన మరణానికి చాలా దగ్గర్లోనే వుండటం కర్రోడికి అర్థమవ్వదు కూడా. అన్నం కానని కడుపులో 'మంట' కనిపించాలి. ఆ మంట కాంక్రీటు కట్టడాలను కాల్చి బూడిద చేయగలదని తెలుసుకోవటానికి కర్రోడు యింకా ఆకలితో మాడాల్సివుంది. 'ఆకలి'కి మూల కారణాలను వెదుకుతూ కర్రోడు అడుగులు వేయసాగాడు.

చావాలా, వద్దా, అని ఆలోచించాడు ఏం తప్పు చేశానని చావాలి? ఆకలవటం తప్పుకాదు. గొప్పోళ్ళ పొట్టలు ఖాళీ కాకముందే భర్తీ అవుతాయి. అయితే కర్రోడి పరిస్థితి మరోలా వుంది. అతను కడుపు ఖాళీ అవుతుందనే దుఃఖాన్ని బహిర్ ప్రదేశానికి వెళ్ళిన ప్రతిసారి అనుభవిస్తాడు. 'మల్లా ఆకలైతాదప్పో' అంటూ సుడిగాలిలో ముఖాన్ని దాచుకుని ఏడ్చేవాడు. అంతలోనే ఏడిస్తే ఎక్కడ శక్తి తగ్గిపోతుందోనని మౌనంగా వుండిపోయాడు. భూగర్భంలో కుతకుతమని వుడికి పోతున్న లావా ఏదో ఒక రోజు పైకుబికి ఖాళీ కడుపుల్ని, రాతి ఇళ్ళని, గల్లా పెట్టెల్ని, పట్టుచీరెల్ని మింగేస్తుందనిపిస్తుంది. కర్రోడి ఆకలి చూసిన మీదటె కుతకులాడే లావాలో రాళ్ళు బొగ్గులవుతాయి. బొగ్గులు వజ్రాలవుతాయి. బాలింత ముఖంలా కనిపించే మామిడి చివుళ్ళనూ, మూడు నెలల పసివాడి ఏముకల్లాంటి వేప పువ్వులను

పళ్ళాల నిండా పట్టుకుని తిరిగుతున్న మనుష్యుల్ని. కర్రోడు దారి విడిచి, ప్రక్కకు తొలగి నుంచుని గమనించాడు. మామిడి ఆకులతో పాటు వేపాకు తోడిమను తెంచి నవ్వాడు. శబ్దం రాలేదు.


దొరగారింటితో సంబంధం ఈనాటిదా ? పశువుల కొట్టం, ఎరువు దిబ్బలు, పేడ తట్ట - వీటితో పాటు ఇంట్లో వున్న ప్రతి ఒక్కరి 'చెప్పులతో' నూ కర్రోడికి పరిచయం వుంది. పశువుతో పరిచయమూ తక్కువ కాదు. తన కూతకు కోడెగిత్త పరుగు తీస్తూ వచ్చేది. పేడ తట్టల అడుగు భాగం కుళ్ళిపోకుండా ప్లాస్టిక్ కాయితం పెట్టికుట్టాడు. చెప్పులు తయారు చేసేటప్పుడు కాలి ఉంగరపు తోలు నునుపు చేయటంలో ఎంతో జాగ్రత్త వహించే వాడు. దొర కూతురు శాంతమ్మ చిలుక పచ్చని పట్టుచీర కట్టుకున్న ప్రతిసారీ ఊరి ముందరి పొలంలోని మామిడి చెట్ల కింద పరవేశితో గడుపుతుందని కర్రోడికి యిట్టే తెలిసిపోయేది. నోరు మెదపకుండా, ఒళ్ళు విరిగేలా కష్టపడుతూ కండలు కరగదీసుకున్న కర్రోడు ఇప్పుడు ఆకలితో అల్లాడుతున్నాడు. అది ఉగాది రోజున అనుభవిస్తున్న దుర్భరమైన ఆకలి. ఒక వేళ ఇప్పుడు నల్లోడు దొర యింట్లో వుండి వుంటే తనను మెచ్చుకోవాలని గేదెల్ని, పశువుల్ని శుభ్రంగా కడిగి వుండేవాడు. దొరసాని వంటింట్లో చారుకు తాళింపు వేస్తే అక్కడ్నుంచి వచ్చే గుమగుమలకు ముక్కుపుటాలు పెద్దవి చేసేవాడు.

"అమ్మా - బువ్వ" అంటూ కంచం పట్టుకుని వొంగి నుంచున్న గంటకు పాచిపోయిన అన్నం, చారు తెచ్చి వొంపేది. చారు చిక్కగా వుంటే కర్రోడు ఎంత సంబర పడేవాడంటే, దాన్ని చూడగానె అతడి కపుడు సగం నిండిపోయేది. ముసలిదాని ముందు ముద్దలు లెక్కపెడుతూ తిని ముంతలోని నీళ్ళు తాగి ఎంతో హుషారుగా వుండే కర్రోడు రెండు రోజులుగా ఒక్క మెతుకు తినలేదు. పెద్ద పేడ తట్టను అవలీలగా ఎత్తుకుని వెళ్లిదిబ్బకు పోసే కర్రోడికి తన శరీరమే భారంగా అనిపించింది. తన భుజాల మధ్య సుంకులిని తియ్యగా బాధపెట్టే కర్రోడు ఆకలితో బెదరిపోయి అడుగులు వేస్తూ తన జీవితంలోనూ నవ్వుకున్న రోజులు వున్నాయి కదా అని ఆశ్చర్యపోయాడు.

ఒకే రీతిగా అరుస్తున్న కాకుల్ని తలెత్తి చూశాడు. వాటి వొంట్లో ఏదో శక్తి. వాటి ముఖాల్లో, విచ్చుకున్న ముక్కుపుటాల్లో ఏదో వుత్సాహం, ఏదోకళ. పూజాగిజా చేశాక మేడ విసిరేసే ఎంగిలి మెతుకుల కోసం వాటి ఆర్భాటం. తానూ ఒక కాకి అయివుంటే కాకిలా ఎగిరివుండేవాడు. మనుషుల కోసం బ్రతికే మనిషిగా పుట్టకూడదనిపించింది. పుట్టిన పాపానికి వదలకుండా అంటుకుని వున్న పొట్ట. ఆ పొట్ట లేకపోతే దొరగారి తుమ్మ చెట్టు నీడలో చాకిరీ చేసేవాడు కాదు కర్రోడు. పొట్ట దేహానికి అనివార్యమైన అంగం. శరీరపు కదలికలన్నీ పొట్టపై ఆధారపడి వున్నాయి. దారిన వెడుతూ వెడుతూ ఎక్కడైనా పడి తాను చచ్చిపోతే ఎవరూ తన శవాన్ని తాకను కూడా తాకరని కర్రోడికి అనిపించింది.

అలికిన వసారా; అక్కడక్కడ చుక్కల ముగ్గులు, తొక్కటానికి వీల్లేదు. దాటటానికి సాధ్యం కాదు. లోపల్నించి వస్తున్న కమ్మని వాసన ముక్కును తాకింది. ఫలాన వంటకం కావచ్చని వూహించడు. 'వాళ్ళు పారబోసే దాంట్లో తనకొక పిడికెడు ఎందుకు పెట్టకూడదూ' అనుకున్నాడు. నుంచొని గుడ్లు మిటకరించి చూశాడు. 'అమ్మా' అని పిలవాలనుకున్నాడు. నాలుక కదల్లేదు. పాడుబడ్డ యింటి బచ్చలిలాంటి ఇంట్లో నాలుక ఎలా కదులుతుంది.

ఈ ఇంటి చాకిర్కి కర్రోడికి కొత్త కాదు. బండ్ల కొద్ది కట్టెలు కొట్టి పెట్టాడు. పశువుల ఒళ్ళు అద్దంలా కడిగాడు. ఆ కారణంగా తనకు అన్నం తప్పకుండా పెడతారని అలాగే నుంచున్నాడు. అన్నం పెడితే వేయించుకోటానికి గట్టి అంగేలేదు. పైతుండు కూడా లేదని బాధపడ్డాడు. దోసిట్లో వేయించుకుంటే సరిపోతుందనే అనుకున్నాడు. అన్నంలోకి నోరు పెట్టి కుక్కలా తినేస్తేసరి. నిలబడ్డవాడు నిల బడ్డట్టే కాలుతున్న కడుపు స్తితిని కళ్ళతోటే మొరపెట్టుకున్నాడు. బొర్రలు పెంచిన వాళ్ళు కర్రోడి వేపు చూడటం అసహ్యంగా భావించి వుండొచ్చు ఓ చిన్న కుక్కపిల్ల కర్రోడ్ని వాసన చూసి మొరుగుతూ బెదిరించింది. అతను ప్రతిఘటించలేదు. అది అలికిన వసారాను, ముగ్గులను దాటి ఇంటి గడపకు ముందరి కాళ్ళను ఆనించి నుంచుంది. కుంయ్ కుంయ్ మనిరాగం తీస్తూ తోక ఆడించింది. ఒక పిల్లవాడు బయటికొచ్చి దాని తల నిమిరాడు. "షేక్ హాండు ఇవ్వు" అంటూ చేయి చాపాడు.



అది సంకోచంగా ఒక కాలు ఎత్తి పిల్లవాడి చేతిని తాకించింది. ఆ మాత్రానికే పిల్లవాడికి చెప్పలేనంత సంతోషం.

"కుక్క నాకు షేక్ హాండిచ్చింది" అని పదే పదే అరుస్తూ లోపలికి పరుగెత్తాడు. తానూ కుక్కలా అలికిన వసారాను, ముగ్గులనూ దాటి గడప దగ్గర నుంచోవటం ఎలా అని కర్రోడు ఆలోచించాడు. ఆ కుక్కను అభిమానంగా చూసినట్టు ఎవరూ తనను చూడరని బాధపడ్డాడు. మళ్ళీ కంటి నుంచి రెండు కన్నీటి చుక్కలు రెప్ప చివరన ముత్యాలు కూర్చినట్టు నిలిచాయి. "అమ్మా! ఆకలేస్తాంది తల్లో" అంటూ కన్నీళ్ళతో గొంతు పెగుల్చుకుని అరిచాడు. ఎవరూ రాలేదు. ఎవరూ పట్టించుకోలేదు. అదే సమయంలో పిల్లవాడు అన్నం పట్టుకుని రావటం చూసి సంతోషంతో వుబ్బిపోయాడు. అరచేతులు దగ్గరగా చేర్చాడు. ఇంకా దోసిలి సరిగ్గా పట్టలేదు. అంతలో పిల్ల వాడు అన్నాన్ని బండమీద వేసి 'కుర్రో ...... కుర్రో' అన్నాడు. కుక్క పరుగెత్తుకొచ్చింది. కర్రోణ్ణి చూసి గుర్రు మంది. పిల్లవాడు కర్రోడ్ని చూస్తూ 'పోపో' అని కసిరాడు. కర్రోడి వొళ్ళు చల్లబడింది. మరుక్షణం కోపంతో మండి పడ్డాడు. ముగ్గుల్ని కసిగా కాలితో చెరిపేసి మళ్ళీ వీధిలోకి వచ్చాడు. ఎక్కడ్నుంచో గణగణమని గంట మోగిన శబ్దం వినిపించింది. పూజలు జరుగుతూ వుండొచ్చు. దేవుళ్ళకు నైవేద్యం పెడుతూ వుండొచ్చు. తన గుడిసెలో ఎదురుగా గోడకు తగిలించిన 'ఎల్లమ్మ' ఫోటో గుర్తుకొచ్చింది. ఎప్పుడో ఒక అగరొత్తి వెలిగించాడు అంతే!

గంజి కాచేటప్పుడు వస్తున్న పచ్చికట్టెల పొగ; కళ్ళనిండా నీటి నిండా, పొగ, నీళ్లు, పొగ గొంతుకు అడ్డుపడి వూపిరి కట్టివేస్తోంది. సుంకులి ఖల్ ఖల్మంటూ ఒకేరీతిగా దగ్గేది. పాడు దగ్గు సుంకులిని సగం తినేసింది. దొర యిచ్చిన గింజలు చాలనప్పుడు పావు, అరపావు జొన్నలు విసరి గంజి కాచుకోవటం అపురూపం. ఒక వేళ పొలానికి వెళితే కర్రోడు నాలుగు జొన్న కంకులు విరుచుకొచ్చేవాడు. ఓ సారి చిన్న దొర కంట పడి నప్పుడు ఏం చెప్పాలి కర్రోడి కథ! వీపుకు ఒకోటి దెబ్బలు; పచ్చదంటు, దెబ్బలు. "ఇంగో పారి సేయన్దొరా" అని కర్రోడు కాళ్ళవేళ్ళాపడ్డా దొర వొదల్లేదు. కొట్టి అలసిన తరువాత కొట్టడం ఆపాడు.

"అబ్బో! దొర దౌరుజన్యం సెప్పనీకి కాదు. పంట పండించేది భూమి తల్లి. ఆకలైనాదని రొన్ని కంకులు కోసింది తప్పే" - కర్రోడు ఈ మాటల్ని ఎన్నోసార్లు అనుకున్నాడు. కర్రోడిలాంటి వందలాది మంది కార్చిన చెమట రూపంలోని రక్తం వల్లే దొరల పొలాలు సేరు విత్తనాలు నాటితే ఐదు పల్లాలు పొండుతాయి. తాను జీవించిన పరిసరాలను గుర్తుకు తెచ్చుకోగానే కర్రోడికి మేడల్ని నేలగూల్చా లన్నంత కోపం వచ్చింది. అతనికి నడవటానికి శక్తి చాల్లేదు. శక్తి కావాలంటే ఒక్క పిడికెడైనా అన్నం కడుపులో పడాలి. అన్నం దొరికితే బ్రతకడం ఖాయం. కానీ దొరికితే అది వెంటనే దొరకాలి. చెట్ల ఆధారంగా, యింటి గోడల ఆధారంగా మెల్ల మెల్లగా ఒక్కొక్క అడుగు వేయసాగాడు. కింది గేరి తప్ప మిగతా వూరంతా వాసన.

బెల్లంతో భక్ష్యాలు చేస్తారని తెలిసే టప్పటికి కర్రోడు దొర యింట్లో జీతానికి కుదిరి నెలయింది. ఆ రోజుల్లో పనిలోకి పోవటం అతనికి ఎంతో సంతోషంగా వుండేది. ఒకటి చెబితే రెండు చేసేవాడు. అతడి వొంట్లో అంత వెచ్చటి నెత్తురుండేది. కాయకష్టంతో వేడెక్కిన శరీరంలో తలెత్తుతున్న కామం; సుంకులి 'చాలు' అనలేదు. 'కావాలి' అనలేదు. కావాలి కావాలి ఎంతైనా కావాలి ' అంది సుంకలి శరీరం. పుట్టిన వాళంతా బతికి వుంటే సుఖంగా వుండేవాడేమోననే భ్రమ కర్రోడిక చాలా రోజుల వరకూ వుండేది. తొమ్మిది మందిలో బ్రతికి బట్టకట్టింది ఇద్దరే ఇద్దరు.

పెళ్ళి చేసుకున్న కొత్తల్లో దొర సుంకులిని ముట్టె వుంటాడని 'కర్రోడికి తెలుసు. "నాను వొల్ల అన్నా దొర యిడిసి పెట్లేదు" అని సుంకులి కర్రోడితో చెప్పుకుని ఏడ్చింది. దొర సుంకులితో యిలా ఎన్నోసార్లు వున్నాడోననే అనుమానం మొన్నటి వరకు కర్రోడిని పీడించేది. మొదిటి పిల్లలిద్దరు పుట్టినపుడు కర్రోడు పిల్లల ముఖాలను పట్టి పట్టి చూశాడు. ఎర్రగా వున్నాయి. తాను నల్లగా వుంటాడు. సుంకులి రంగు కూడా నల్లటి నలుపే. ముక్కు, కళ్ళు అంతా వేరే. ఏదీ తనది కాదనుకున్నాడు. ఆలోచిస్తూ ఆలోచిస్తూ కర్రోడికి విషయమంతా అర్థమయింది. గుండెల్లో అగ్ని కొండలు బ్రద్దలైనాయి. నిదుర దూరమయ్యింది. మగపిల్లవాడు పుట్టిన సంతోషం ఎంత వెదికినా కర్రోడిలో కొంచెం కూడా కనిపించలేదు 'దొరకి పుట్టిం దేవి' అని ఆ రాత్రి ఎన్నోసార్లు గొణుక్కున్నాడు. తెల్లరగట్లే లేచాడు. బాలింతరాలు సుంకులి మూల్గుతూ వున్నా లేచేంత స్పృహలో లేదు. కర్రోడి చేయి పసివాడి గొంతు నిర్దయగా నులిమింది. మరుసటి రోజు దాన్ని మట్టి చేసేటప్పుడు సుంకులి గుండెలు పగిలేలా ఏడ్చింది. అందరూ ముక్కు మీద వేలు వేసుకునేలా కర్రోడు పకపకా నవ్వేశాడు. రెండవ సారి 'ఆడపిల్ల' పుట్టిన మూడో రోజున గొయ్యిలోకి చేరింది. లేదా చేర్చాడు. అప్పటికి సుంకులి ఒళ్ళు కరిగి ఎముకల గూడయింది. దొర కళ్ళెత్తి చూడనంత డీలా పడింది ఆమె శరీరం. ఆ తరువాత పుట్టిన పిల్లలందరూ కర్రోడివే అనటంలో సందేహం లేదు. 'పుట్టించేడిది అతను సాకేడిది మేమా' అనుకుంటూ కర్రోడు కోపంతో మండిపోయాడు.

ఎవరి పొలంలోనో ఎవరికో విత్తటానికి అవకాశం యిస్తే ఇక అయినట్టే!

పాడు జ్ఞాపకాల సుడిలో పడి ఎక్కడికో వచ్చాడు కర్రోడు.

సూర్యుడు నడి నెత్తి

మీదికొచ్చాడు.

గవాక్షాల గుండా వస్తున్న పొగ తగ్గింది. కొందరి నోట్లోంచి వస్తున్న పులిత్రేన్పులు కఱ్రోడి చెవుల మీద దాడి చేశాయి. అందరి పంచెలు వొదులై వుండటం, పొట్ట పగిలేలా తిని వుండటం, సాకిన సిల్లులు యిళ్ళు మారి వుండటం యిలా అన్నింటిని కఱ్రోడు సూక్ష్మంగా గమనించాడు.

'రంయ్'మని గాలి వీచింది.

కఱ్రోడు పడిపోయేలా వున్నాడు. మొండి గోడ లేకుంటే అతను కింద పడి లేచి వుండే వాడే కాదు. ఆ పాడు గోడకు చేయి ఆనించి నడవసాగాడు. ఈశ్వరుని గుడి గంటానాదం చెవులను తాకాయి. ఈశ్వరుడు ఎలా వుంటాడని ఎవరైనా అడిగితే తన శిశ్నంలా వుంటాడని చెప్పటానికి కఱ్రోడు వెనుకాడడు.

కొత్త బట్టలు కట్టుకున్న వాళ్ళ హడావుడి అంతా యింతా కాదు. వస్త్రం కప్పిన పళ్ళాలు పట్టుకుని గుడి దగ్గరకు వెళుతుండటం కఱ్రోడు గమనించాడు. వాటి వాసనలు ముక్కుకు తాకగానే సంతోషపడ్డాడు. గుడికి వెళుతున్న వాళ్ళలో కొందరు 'పక్కకి జరుగు' అని కసిరారు. కఱ్రోడు గోడకు అంటుకుని నిలబడ్డాడు. అలా గోడ దగ్గరకు జరగటంలో దేన్నో తొక్కాడు. అసహ్యంగా అనిపించింది. ఆకలితో కడుపు కాలినపుడు ఏది మంచిది, ఏది చెడ్డది అనే విషయం పాడు మెదడు ఆలోచించదు.

దొర అతన్ని కొట్టి బయటకి నెట్టి వేయడానికి కఱ్రోడు అంత కాని పనేమీ చేయలేదు. కఱ్రోడికి వయసు మీద పడటమే ఒక తప్పు. ఏదో ఒక కారణంతో కఱ్రోడిని గడపలోకి రావద్దన్నాడు దొర. ఆ రోజు నుంచి కఱ్రోడు క్రమక్రమంగా ఆకలికి దగ్గరయ్యాడు.

కఱ్రోడు భారంగా నిట్టూర్చాడు.

'గింత సేపయినా వాకిలి పట్టకుండా జనాలు తిరుగుతుండారు' అని గుడి వాకిలి వేపు ఛూసి అనుకున్నాడు. అక్కడే కూర్చున్నాడు. ముసలిది యింకా బ్రతికి వుంటుందో, వుండదో అన్న అనుమానం వచ్చింది కఱ్రోడికి. కొత్త రకం పంచెల్ని, కొత్త రకం చీరెల్ని చూడాలంటే ఒక విధమైన సంతోషం. 'ఆ రాయికి ఇచ్చేదిది కంటే నాకియ్యండి' అని అడగాలని అతనికి అనిపించింది. రెండడుగులు ముందుకు వేశాడు. జరిగి నిలబడు' అని ఎవరో గదిరించారు. నైవేద్యాన్ని చూసి కాకులు, కుక్కలు సంబరంగా అరుస్తున్నాయి.

సూర్యుడు పడమరలో దిగసాగాడు.

గుడికొచ్చే జనం తగ్గారు. అక్కడొకరు ఇక్కడొకరు. కఱ్రోడు గుడి వేపు కదిలాడు. గుడి తల వాకిలి తాకినా ఎద అదరలేదు. వొంగి చూశాడు. లోపల నేతి దీపం వెలుగులో దక్షిణగా వచ్చిన నాణ్యాలను లెక్కపెట్టుకుంటూ కూర్చున్న పూజారి తన ధ్యాసలో తానున్నాడు. ఒక వేపు వేలకొద్దీ ఈగల దాడికి గురైన భక్ష్యాలు, తీపు పదార్థాలు, అన్నం రాశి కనిపించాయి. కళ్ళార్పకుండా చూశాడు. ఆశ్చర్యంతో పాటు నోరూరింది. నాలుకతో పెదవులు తడుపుకున్నాడు. కేవలం ఆ పదార్థాలను చూడగానే కఱ్రోడు చురుగ్గా మారాడు. ఇక తింటే అతన్లో ఎంత హుషారొస్తుందో. కఱ్రోడు మరొక అడుగు ముందుకు వేసి చూశాడు. పూజారి తల తిప్పి చూశాడు. కూర్చున్న చోటి నుంచి లేవకుండానే "ఎవరిది?" అన్నాడు. "నాను సోమి కఱ్రోడ్ని" అని కఱ్రోడు అనగానే పూజారి ఆదరాబాదరాగా లేచి అతని దగ్గరకు గవగవా వచ్చి -"దరిద్రపు ముండా కొడుకా, ఇక్కడి వరకు వచ్చావా, ముందు బయటకి పో" అని కసిరాడు. కఱ్రోడు కదల్లేదు. "రెండొద్దుల్నించి కడుపుకేం తిన్లేదు సోమి. దాంట్లోది రొంత పెట్టు సోమి" అన్నాడు. పూజారి పళ్ళు కొరికాడు. ఉన్న రెండు పళ్ళలో ఒకటి అల్లాడింది.

'అది నీలాంటి వాళ్ళకు యివ్వటానికి కాదు. అది ప్రసాదం...."

పూజారి మాటలు విన్న కఱ్రోడి ఒంట్లో అదోలాంటి ఆవేశం కలిగింది. "పర్సాదమంటా...పర్సాదం....." అంటూ పూజారిని పక్కకు తోసి లోపలికి దూరాడు. వాడ్ని ముట్టుకుంటే తన శరీరం ఎక్కడ భగ్గుమని మండి పోతుందోనని భయపడ్డ పూజారి కఱ్రోడ్ని ఆపకుండా గుడి ముందుకు వెళ్ళి కేకలు పెట్టసాగాడు. ఇండ్లు గుడికి కొంచం దూరంలో వుండటం వల్ల పూజారిని కేకలు భక్తులు చెవులకు నిదానంగా చేరాయి.

ఇక్కడ లోపలకు దూరిన కఱ్రోడు చేతికి దొరికింది దొరికినట్టు గబగబా నోట్లో కుక్కుకున్నాడు. గొంతులో అడ్డం పడితే తీర్థం చెంబును గొంతులోకి వొంపుకున్నాడు. తిన్న తరువాత పంచె చివరన భక్ష్యాలు, పదార్థాలు మూట కట్టాడు. అదే సమయంలో బయట నుంచి మనుష్యులు దబదబమని గుడివేపు పరుగెత్తుకు రావటం కిటికీ గుండా చూసిన కఱ్రోడు శివలింగం ప్రక్కనే నిలబెట్టిన త్రిశూలాన్ని తీసుకుని తలుపుల దగ్గరకి వచ్చాడు. ఎదురుగా గోడ కట్టినట్లు నుంచున్న జనం కఱ్రోడ్ని ది గ్భ్రాంతితో చూస్తుండి పోయారు. "అరేయ్! ఎవళ్లైనా నాకడ్డమొస్తే ఆళ్ళని గీ త్రిశూలంతో పొడిచేస్తాన్రో" అని కఱ్రోడు గర్జించాడు. జనాలు కంగారుగా పక్కకు జరిగారు. నిప్పు కణికల్లా ఎర్రబడ్డ కళ్ళను చూసి దారి యిచ్చారు. కఱ్రోడు నిర్భయంగా కనుమరుగయ్యేంత వరకు నడుచుకుంటూ పోయాడు - వెలుతురులోకి!

అనువాదం: రంగనాథ రామ చంద్రరావు